క్లుప్తంగా

పురాతన శిలాజాలు, విగ్రహాలు పరిరక్షించాలి

వేమనపల్లి: మండలానికే తలమానికంగా ఉన్న పురాతణ శిలాజాలు దశవతార క్షేత్రాన్ని పరిరక్షించాలని బీజేవైఎం రాష్ట్ర స్పోర్ట్స్ కన్వీనర్ మహేందర్, బెల్లంపల్లి అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్, మండల అధ్యక్షుడు ఏట మధుకర్ అన్నారు. మండలంలోని రాజారాం దశవతార విగ్రహాలను, ఇటీవల ధ్వంసమైన డైనోసర్ శిలాజాలను సందర్శించారు. గుప్తనిధుల పేరిట దశవతార విగ్రహాలను రోడ్డు నిర్మాణం కోసం ధ్వంసం చేస్తూ చరిత్ర ఆనవాళ్లను నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. దాడులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కంపెల అజయ్, వెంకటేష్, మధునయ్య, స్వామి పాల్గొన్నారు.

రేపు కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు

శ్రీరాంపూర్: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామచందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నస్పూర్ నాగార్జున కాలనీలోని ప్రాణహిత స్టేడియంలో 16సంవత్సరాలలోపు బాల బాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. ఇందులో ఎంపికైన జట్లు ఈ నెల 20నుంచి 23వరకు వికారాబాద్ జిల్లాలోని వికారాబాద్ పట్టణం షేక్ నగర్ గ్రౌండ్లో జరిగే 34వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు రేపు ఉదయం 9గంటలకు మైదానానికి వచ్చి రిపోర్ట్ చేయాల్సిందిగా సూచించారు. పూర్తి వివరాలకు 99120 29691 కు సంప్రదించాల్సిందిగా సూచించారు.

పెన్షన్ కేసులు సెటిల్ చేయాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో కొంత మంది రిటైర్డ్ కార్మికులకు ఈ నెల పెన్షన్ రాలేదని, ఈ కేసులన్నింటినీ సత్వరమే సెటిల్ చేయాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచీ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, నాయకులు బండి రమేశ్, పానుగంటి సత్తయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవన్ ప్రమాణ్, హెల్త్‌కార్డుల రెన్యూవల్ సందర్భంగా జరిగిన చిన్నచిన్న పొరపాట్ల వల్ల కొంతమంది పెన్షన్ ఆగిపోయిందన్నారు. వెంటనే వాటిని సవరించి సెటిల్ చేయాలని దీనికి కంపెనీ అధికారులు చొరవ చూపాలని కోరారు.

మైసమ్మ జాతర ఘనంగా నిర్వహించాలి

మంచిర్యాలటౌన్: జిల్లాలోని క్యాతన్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఈ నెల 14నుంచి 16వరకు గాంధారిఖిల్లా మైసమ్మ జాతర ఘనంగా నిర్వహించాలని మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్, మందమర్రి తహసీల్దార్ సతీశ్‌కుమార్, క్యాతన్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌రాజు, మందమర్రి సీఐ కె.శశిధర్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి భగవాన్‌రెడ్డి, ఆదివాసీ సంఘ నాయకులు, జాతర కమిటీ ప్రతినిధులతో జాతర నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్ ఆధ్వర్యంలో పారిశుధ్యం, తాగునీరు, రోడ్ల మరమ్మతు పనులను చేపట్టాలని తెలిపారు.

సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో సర్టిఫికెట్ కోర్సు ఇన్ టాలీని సోమవారం ప్రారంభించారు. బీకాం మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులకు కోర్సు అందించనున్నారు. 30రోజుల తర్వాత పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి మాట్లాడుతూ.. సర్టిఫికెట్ కోర్సు విద్యార్థుల ఉపాధి అవకాశాలు పెంచుతుందన్నారు. కార్యక్రమంలో కామర్స్ విభాగం అధ్యాపకులు నరేందర్‌రెడ్డి, మధుసూదన్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న ఏపీఎంలు, సీసీలు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని జిల్లా సమాఖ్య కార్యాలయంలో సోమవారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐకేపీ ఏపీఎం, సీసీలకు మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా సాధికారత హబ్‌జెండర్ స్పెషలిస్టు మౌనిక, ఫైనాన్సియల్ లిటరసీ లిప్సికలు బేటీ పడావో, బేటీ బచావో, లింగ వివక్షత, లింగ సమానత్వం, బాల్యవివాహాల నిరోధక చట్టం, సైబర్ క్రైం, చైల్డ్ హెల్ప్‌లైన్, సీనియర్ సిటిజన్ హెల్ప్‌లైన్, ఫోక్సో యాక్టు, నేషనల్ ఎమర్జెన్సీ, మిషన్ వాత్సల్య, సుకన్య సంవృద్ధి యోజన, తదితర పథకాలు, హెల్ప్‌లైన్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీపీఎం వేణు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, హార్టికల్చర్ అధికారులు, షీటీం సభ్యులు పాల్గొన్నారు.

జాతరకు తరలివచ్చిన భక్తులు



శివసత్తుల పూనకాలు



జాతరలో వెలిసిన దుకాణాలు



ముగిసిన ముత్యాలమ్మ జాతర

కోటపల్లి: మండలంలోని ఎదులబంధం గ్రామంలో భక్తి శ్రద్ధలతో మూడు రోజులు పాటు జరిగిన ముత్యాలమ్మ జాతర సోమవారం ముగిసింది. గిరిజనుల ఆరాధ్యదైవం, గిరిజనేతరుల కొంగుబంగారంగా పూజలందుకున్న ముత్యాలమ్మ జాతరలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అమ్మవార్లకు నియమనిష్టాలతో వివిధ రకాల పదార్థాలతో తయారు చేసిన నైవేద్యాలను కొత్త కుండల్లో బోనంగా తయారు చేసి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కోటపల్లి మండలం నుంచే కాకుండా చెన్నూర్, మంచిర్యాల, గోదావరిఖని, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు జేక శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

వైభవంగా గట్టు మల్లన్న స్వామి పునఃప్రతిష్ట



దోనలో పునః ప్రతిష్ట పూజలు చేస్తున్న పండితులు



హోమం నిర్వహిస్తున్న పండితులు

జైపూర్: మండలంలోని ప్రసిద్ధిగాంచిన వేలాల గట్టు మల్లన్న స్వామి ఆలయంలో సోమవా రం పునః ప్రతిష్ట పూజ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. వేద పండితులు రాముశర్మ నేతృత్వంలో దోనలో స్వయంభువుగా వెలిసిన మల్లన్న స్వామి ఆలయంలో ప్రాణ ప్రతిష్ట, శివలింగం, నంది విగ్రహాలు పునఃప్రతిష్టించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొ ని మల్లన్న స్వామిని దర్శించుకున్నారు.

ఆధ్యాత్మికం



ప్రతిష్టించిన హనుమాన్ విగ్రహం

హనుమాన్ విగ్రహ ప్రతిష్ట

కోటపల్లి: మండలంలోని రాంపూర్ గ్రామంలో సోమవారం హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్టించారు. గణపతి పూజ నిర్వహించిన అనంతరం హోమంతో హనుమంతుడి విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిల్లి బారతి, నాయకులు విద్యాసాగర్, పడాల శ్రీనివాస్, వొద్ది సంతోశ్, గ్రామపెద్దలు, ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్టీపీపీ రామాలయంలో విగ్రహ ప్రతిష్ట



విగ్రహాలు తీసుకొస్తున్న డైరెక్టర్ సత్యనారాయణరావు, అధికారులు

జైపూర్: మండల కేంద్రంలో గల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో నూతనంగా నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. మూడు రోజులు పాటు నిర్వహించిన ప్రతిష్ఠాపన కార్యక్రమాలకు సోమవారం సింగరేణి డైరెక్టర్(ఈఅండ్‌ఎం, ఆపరేషన్స్, పీపీ)డి.సత్యనారాయణరావు కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సీతారామచంద్ర స్వామి నూతన ఆలయ స్థిర విగ్రహ సుదర్శన, గోదాదేవి, రామానుజ నమ్మల్వార్ చల విగ్రహ ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవాలు చేపట్టారు. వేదపండితులు శ్రీమాన్ శ్రీ గోవర్ధనగిరి జగన్నాథచార్యులు వారి శిష్యబృందం వెంకట రమణాచార్యులు, సముద్రాల భానుకుమార్, సేవాపతి శేషాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, సముద్రాల అనంత ఆచార్యులు, భరతాచార్యులు నేతృత్వంలో పూజలు చేపట్టారు. ప్లాంటులో పండుగ వాతావరణం నెలకొంది. ఒక్క ఏడాదిలో ఆలయం పూర్తి చేసుకొని ప్రారంభించుకోవడం ఆనందదాయకం అన్నారు. కార్యక్రమంలో జీఎంలు డీవీఎస్ఎన్‌రాజు, ఎస్టీపీపీ ఈడీ శ్రీనివాసులు, అధికారులు, ఉద్యోగులు కుటుంబసమేతంగా పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



విన్నర్స్ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న నాయకులు

తాండూర్: మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెట్టెం విష్ణుకళ్యాణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాకా వెంకటస్వామి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు సోమవారం అట్టహాసంగా ముగిశాయి. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 28 టీమ్‌లు హాజరయ్యాయి. హోరాహోరిగా సాగిన పోటీల్లో ఫ్రెండ్స్–11, శివాజీ సీనియర్స్ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఫైనల్ పోటీల్లో సత్తా చాటి ఫ్రెండ్స్–11 జట్టు క్రీడాకారులు విన్నర్స్‌గా, శివాజీ సీనియర్స్ జట్టు క్రీడాకారులు రన్నర్స్‌గా నిలిచారు. విజేతలైన క్రీడాకారులకు తాండూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ ఈసా, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ ముఖ్య అతిథులుగా హాజరై బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్, యూత్‌కాంగ్రెస్ నాయకులు శంకర్ గౌడ్, జుబైర్, శ్రీధర్, సాగర్, తిరుపతి, మహేష్, భాస్కర్ గౌడ్, శివ ప్రసాద్, రఘు, రవి, సురేష్, నవీన్‌గౌడ్, రమేష్, అరుణ్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

పనులు నిలిపివేయాలని రైతుల ఆందోళన



పురుగు మందు డబ్బాతో రైతు నిరసన

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి వెంకట్రావుపేట గ్రామానికి 33కేవీ విద్యుత్ లైన్ వేయడానికి విద్యుత్ శాఖాధికారులు పనులు ప్రారంభించడంతో రైతులు అడ్డుకున్నారు. పొలాలు కోసిన తరువాత పనులు నిర్వహించాలని పురుగు మందుడబ్బాలతో నిరసన వ్యక్తం చేశారు. ఎస్సై సతీష్, పోలీసులు విద్యుత్ శాఖాధికారులు సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడి పొలాలు చెడిపోకుండా పనులు నిర్వహిస్తామని తెలుపడంతో శాంతించారు.

కాండం తొలుచు పురుగు నివారణపై అవగాహన



కొత్తపల్లిలో వరిని పరిశీలిస్తున్న ఏవో సుధాకర్

భీమారం: మండలంలోని కొత్తపల్లిలో రైతులు సాగు చేస్తున్న వరిపొలాలను సోమవారం ఏవో అత్తె సుధాకర్ సందర్శించారు. ఈ మేరకు పంటపొలాలను కలియతిరిగారు. వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతిని గుర్తించారు. కొన్ని పొలాల్లో చౌడు ఉండటాన్ని పరిశీలించారు. కాండం తొలుచు పురుగు నివారణకు లాండ సైహలోత్రిన్, క్లోరంతేనిప్రోలు 100మిల్లీలీటరు లేదా ఫ్లూబెండమైడ్ 40గ్రాములు లేదా కార్‌టాప్ ఆఫ్ హైడ్రోక్లోరైడ్ 75శాతం ఎస్‌జి 200గ్రాములు లేదా క్లోరం తేనిప్రోలు 0.4శాతం గుళికలు 4కిలోలు ఎకరానికి వేసి నివారించవచ్చని రైతులకు సూచించారు. చౌడు నివారణ కోసం లిక్విడ్ సల్ఫర్ 40శాతం ఎస్సీ లేదా లిక్విడ్ సల్ఫర్ 56శాతం ఎస్సీని 10కిలోల ఇసుకలో కలిపి ఎకరం పొలంలో పల్చగా నీళ్లు పెట్టి చల్లాలన్నారు. మూడు రోజులు నీళ్లు ఎటూ వెళ్లకుండా చూసినట్లైతే చౌడుని చాలా వరకు నివారించవచ్చునన్నారు. ఇందులో ఏఈవో అరుణ్‌కుమార్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

కౌలు రైతుల ధర్నా



కాటన్ మిల్లు ఎదుట ధర్నా చేస్తున్న కౌలు రైతులు

చెన్నూర్‌రూరల్: పత్తి అమ్మకాలు జరిపేందుకు తాత్కాలిక రిజిస్ట్రేషన్లు చేయాలని కౌలు రైతులు చెన్నూర్‌లోని కాటన్ మిల్లు ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. కౌలు రైతులు పత్తి అమ్ముకునేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీఐ అధికారులు కౌలు రైతుల తాత్కాలిక రిజిస్ట్రేషన్లు చేసుకొని పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు అధికారులను ఒప్పించి ధర్నా విరమింపజేశారు.

కరపత్రాల ఆవిష్కరణ

మంచిర్యాలఅర్బన్: టీఎస్‌యూటీఎఫ్ బలపరిచిన టీపీటీఎఫ్ అభ్యర్థి అశోక్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో టీఎస్‌యూటీఎఫ్ నేతలు ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు చక్రపాణి, ప్రధాన కార్యదర్శి రాజావేణు, ఉపాధ్యక్షులు కిరణ్‌కుమార్, లావణ్య, పలువురు పాల్గొన్నారు.

విహారయాత్రకు విద్యార్థులు

భీమారం: మండలంలోని దాంపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం విహారయాత్రలో భాగంగా మందమర్రిలోని సింగరేణి సంస్థ పార్క్‌కు వెళ్లారు. చదువుతోపాటు విజ్ఞానం, ఆటపాటల్లో కూడా పిల్లలను భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో పార్కుకు తీసుకెళ్లినట్లు ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్, ఉపాధ్యాయురాలు ఉమ తెలిపారు.

రక్తదాన శిబిరం

పాతమంచిర్యాల: పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం రహీం బ్లడ్ డొనేషన్ వెల్ఫేర్ సొసైటీ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 36మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు



ఆంజనేయ విగ్రహం పక్కనే జరిపిన తవ్వకాలు



గతంలో తవ్వకాల్లో ధ్వంసమైన కూర్మావతారం శిలాజం

వేమనపల్లి: మండలంలోని రాజారాం రేణుక ఎల్లమ్మ దేవస్థానం వద్ద మళ్లీ గుప్త నిధుల తవ్వకాలు గుట్టుగా సాగుతున్నాయి. వారం రోజుల క్రితం అర్ధరాత్రి తవ్వకాలు జరిపారు. ఆంజనేయ స్వామి విగ్రహం పక్కనే రెండు మీటర్ల లోతు కందకం తవ్వకారు. విగ్రహాన్ని పోలి ఉన్న బండరాయి ఉండడంతో తవ్వకాలు ఆపినట్లు తెలుస్తోంది. పసుపు, కుంకుమ, అగర్బత్తులు ఉంచి క్షుద్ర పూజలు చేశారు. తవ్వకాలకు రెండు రోజుల ముందు కొందరు కార్లలో వచ్చి రెక్కీ నిర్వహించినట్లు స్థానికులు తెలిపారు. ఊరంతా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనా గ్రామాల్లో రెండు వర్గాల మధ్య సమన్వయం లేక మిన్నకుండిపోయారు.

అటెన్షన్ ప్లీజ్..



సెప్టిక్ ట్యాంక్ మరమ్మతు చేయించరూ..!

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ 9వ వార్డు కాంట్రాక్టర్ బస్తీ మూసివేతకు గురైన రామా టాకీసు లేడీస్ గేట్ వద్ద అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిండిపోయి సెప్టిక్ ట్యాంక్ జామ్ అయింది. సెప్టిక్‌ట్యాంక్ నుంచి నీరు పైకి వచ్చి రోడ్డుపై పారుతుండటంతో దుర్వాసన వస్తోంది. ఆ వీధి నుంచి రాకపోకలు సాగిస్తున్న ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమస్య ఏర్పడి ఏడాది కాలం గడుస్తున్నా ఇంతవరకు పరిష్కరించలేదు. మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బస్తీ వాసులు, పురప్రజలు కోరుతున్నారు.

సంప్రదించాల్సిన అధికారి: కె.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్

ఫోన్ నంబర్ : 98499 05887

‘తక్కువగా చూపడం సరికాదు’

దండేపల్లి: ఇటీవల చేపట్టిన కులగణనలో నేతకాని కులజనాభాను తక్కువగా చూపడం సరికాదని నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి గోళ్ల రాజమల్లు ఆరోపించాడు. ఈ విషయంపై దండేపల్లిలో నేతకాని మహర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రం అందించారు.

గుడుంబా పట్టివేత

భీమిని: గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అక్బర్‌హుస్సేన్ అన్నారు. మండలంలోని కర్జీభీంపూర్ గ్రామంలో సోమవారం తనిఖీలు నిర్వహించారు. పది లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో డీటీఎఫ్ సీఐ సమ్మయ్య, ఎస్సై వెంకటేష్, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు నష్టం జరగకుండా చూడాలి

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఎన్నికలను వాయిదా వేసి

సంక్షిప్త వార్తలు

మే నెలలో నిర్వహించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు సయింపు శ్రీనివాసరావు కోరారు. టీచర్ల ఎన్నికల విధులకు సంబంధించి మూడు రోజుల పాటు శిక్షణతో పాఠశాలలకు దూరమయ్యే అవకాశాలు ఏర్పడ్డయన్నారు. పలు రకాల విధుల కారణంగా కీలకమైన సమయంలో విద్యార్థులకు తీవ్ర నష్టం జరిగే పరిస్థితులున్నాయన్నారు.

ఘనంగా రమాబాయి జయంతి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని గాంధీనగర్‌లో సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఓ ప్రైవేటు పాఠశాలలో రమాబాయి అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా ఎస్సీ లైసెన్ అధికారి కిరణ్‌కుమార్ రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పారిశుధ్య పనులు పూర్తి చేయాలి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల గోదావరి ఒడ్డున గల సమ్మక్క సారక్క మినీ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారిశుధ్య పనులు పూర్తి చేయాలని మంచిర్యాల కార్పొరేషన్ కమిషనర్ శివాజీ అన్నారు. ఈ నెల 12 నుంచి 14వ వరకు సమ్మక్క సారక్క మినీ జాతర జరగనుంది.

విద్యార్థులకు అవగాహన

జన్నారం: విద్యార్థులకు చదువుతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, వారి విధుల గురించి అవగాహన కల్పించేందుకు జన్నారం మండలం పొన్కల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సోమవారం కార్యాలయాల్లో పర్యటించారు. పోలీస్‌స్టేషన్, ఫైర్ స్టేషన్, విద్యుత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాలను విద్యార్థులు సందర్శించారు. అధికారుల విధుల గురించి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై రాజవర్ధన్ ఆయుధాల గురించి వివరించగా, ఫైర్ అధికారి శ్రీనివాస్ ఫైర్ స్టేషన్‌లో సిబ్బంది నిర్వహించే విధుల గురించి వివరించారు. రెవెన్యూ, విద్యుత్, మండల పరిషత్ కార్యాలయాల్లో విధుల గురించి వివరించారు.

ఓటర్ల జాబితా ప్రదర్శన

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): హాజీపూర్ మండల ప్రజాపరిషత్, పంచాయతీ కార్యాలయాల్లో సోమవారం రెండో సాధారణ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను పురస్కరించుకొని ఎంపీటీసీల వారీగా ఓటర్ల జాబితాను నోటీస్ బోర్డుపై ప్రదర్శనగా ఉంచారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

మంచిర్యాల : 9010299065, 9951602823

Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
చెన్నూర్ : సంపత్‌కుమార్ - 9949708989
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899